తెలంగాణ
# ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



హైదరాబాద్ మంగళవారం 04- 11 - 2025 ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి పేజీలు : 3





**30 ఏండ్లుగా ఉంటున్న ఇల్లును కూల్చారని..**

# రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో

- ఆత్మహత్యే శరణ్యమంటూ పెట్రోల్ క్యాన్ తో కుటుంబం ఆత్మహత్యాయత్నం
- పెట్రోల్ క్యాన్ లాక్కెళ్లిన పోలీసులు
- ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కూలగొట్టారని ఆవేదన
- కుటుంబానికి మద్దతుగా కాశవారిగూడెం ప్రజల ఆందోళన

ప్రజావారధి/మోత్కూరు

మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలోని కాశవారిగూడెంలో 30 ఏళ్లుగా ఉంటున్న ఇల్లును అధికారులు ఎలాంటి సమాచారం లేకుండా కూల్చివేశారని, తమకు ఆత్మహత్యే శరణ్యమని ఆ కుటుంబం పెట్రోల్ క్యాన్‌తో రోడ్డుపై బైఠాయించి రాస్తారోకోకు దిగారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ ఆ గూడెం ప్రజలంతా మద్దతుగా ఆందోళనకు దిగారు. రాస్తారోకోతో మోత్కూరు- తిరుమలగిరి రోడ్డులో సుమారు గంటకు పైగా రాకపోకలు నిలిచిపోయాయి. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... మున్సిపల్ కేంద్రంలోని కాశవారిగూడెంలో సర్వే నంబర్ 402లో 242 గజాల స్థలంలో 30 ఏళ్ల క్రితం గుడిసె వేసుకుని భార్యాభర్తలు మహ్మద్ మౌలానా, గోరీబీ కుటుంబంతో నివాసం ఉంటున్నారు. మౌలానాకు ముగ్గురు కొడుకులు కాగా పెద్ద కొడుకు, రెండో కుమారుడి వివాహమైంది. రెండో కుమారుడు రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. 2013 నుంచి పెద్ద కుమారులు పక్కీర్ అహ్మద్ ఆ ఇంట్లోనే భార్యాపిల్లలతో ఉంటున్నాడు. సుమారు పదేళ్ల క్రితం స్వంత ఇల్లు కోసం ఆ స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టారు. ఆర్థిక ఇబ్బందులతో ఇంటి పనులు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో ఆ స్థలం తనకు స్పోర్ట్స్ కోటాలో ఇచ్చారని, స్థలాన్ని తనకు అప్పగించాలని అడ్డగూడూరు మండలం కోటమర్తి గ్రామానికి చెందిన బెల్లె నగేష్ తహసీల్దార్, జిల్లా అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశాడు. నగేష్ ఇచ్చిన ఫిర్యాదుతో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పోలీస్ ప్రొటెక్షన్‌తో సోమవారం మధ్యాహ్నం ఇల్లును కూల్చేశారు. తమకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని, పనికి వెళ్లగా ఇంటి వద్ద లేని సమయంలో కూల్చివేశారని, బండ కొట్టుకుని, కూలీనాలి చేసుకుని బతికే తాము రోడ్డున పడ్డామని బోరున విలపించారు. తమకు ఆత్మహత్యే శరణ్యమని పెట్రోల్ క్యాన్‌తో రోడ్డుపై ఆందోళనగా దిగగా విషయం తెలిసి పోలీసులు అక్కడకు చేరుకుని పెట్రోల్ క్యాన్‌ను లాక్కున్నారు. బెల్లె నగేష్ స్పోర్ట్స్ కోటాలో ఇది వరకే భువనగిరి పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో డబుల్ బెడ్ రూం ఇల్లు తీసుకున్నాడని, మళ్లీ అతనికే కాశవారిగూడెంలో ఇంటి స్థలం ఎలా ఇస్తారని, ఒకే వ్యక్తి ప్రభుత్వం రెండుచోట్ల డబుల్ బెడ్ రూం ఇల్లు, 242 గజాల స్థలం ఎలా ఇస్తుందని ప్రశ్నించారు. అధికారులు విచారణ చేసి భువనగిరిలో నగేష్‌కు ప్రభుత్వ స్థలం ఇచ్చినందున 30 ఏళ్లకు పైగా అక్కడే జీవిస్తున్న తమకు ఆ స్థలం కేటాయించి న్యాయం చేయాలని కోరారు. బస్సులు, వాహనాలు నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, అధికారులకు సమస్యను వివరించి పరిష్కరించుకోవాలని పోలీసులు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక
మంగళవారం


## ఫీజు బకాయిలు వచ్చేంత వరకూ..

# డిగ్రీ కాలేజీలు తెరువం

## మోత్కూరులో శ్రీ సంతోష్, సాయిరాం డిగ్రీ కాలేజీలు నిరవధిక బంద్




**ప్రజావారధి/మోత్కూరు**

ప్రైవేట్ డిగ్రీ కాలేజీలకు ప్రభుత్వం ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేసే వరకూ కాలేజీలు తెరిచేది లేదని నిరవధిక బంద్‌కు పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలల యాజమాన్య సంఘం (టీపీడీఎంఏ) పిలుపులో భాగంగా సోమవారం యాదాద్రి జిల్లా మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని శ్రీ సంతోష్ డిగ్రీ కాలేజీ, సాయిరాం డిగ్రీ కాలేజీ యాజమాన్యం కాలేజీ మూసేసి బంద్‌లో పాల్గొన్నారు. ప్రభుత్వం బకాయిలు ఇచ్చేంత వరకు కాలేజీలు తెరువవద్దని తీర్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నాలుగు సంవత్సరాలుగా ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, కాలేజీల అద్దెలు, వేతనాలు ఇచ్చేందుకు అప్పులు చేయాల్సి వస్తోందని, అప్పుల పాలై ఆస్తులు అమ్ముకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం బకాయిలను విడుదల చేయకుండా పెండింగ్‌లో పెట్టడంతో ఇటు యాజమాన్యాలు, అటు విద్యార్థులు తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతున్నారన్నారు. కాలేజీల సమస్యలను తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలల యాజమాన్య సంఘం గత సెప్టెంబర్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వారితో జరిపిన చర్చల్లో దసరా వరకు రూ.600 కోట్లు, దీపావళి వరకు రూ.600 కోట్లు విడుదల చేస్తామని చెప్పి కేవలం రూ.300 కోట్లు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మిగతా బకాయి ఉన్న రూ.900 కోట్లు ఇచ్చేంత వరకు కాలేజీలు తెరిచేది లేదన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యజమానులు, లెక్చరర్లు బత్తిని నవీన్, సతీష్, మమత, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక
జనరల్ న్యూస్
మంగళవారం
04 - 11 - 2025


# బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

## మోత్కూరులో బీసీ నాయకుల బైక్ ర్యాలీ..తహసీల్దార్‌కు వినతిపత్రం

ప్రజావారధి/మోత్కూరు

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో బీసీ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర బీసీఐఎఫ్ పిలుపుమేరకు మున్సిపల్ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ జ్యోతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీసీ జేఏసీ నాయకులు మాట్లాడుతూ బీసీలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించాలని, కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయాలన్నారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో బీసీల జనాభా ప్రకారం వాటా తేల్చాలని, రాజ్యాంగ సవరణ చేసి 9వ షెడ్యూల్‌లో చేర్చి చట్టబద్ధత కల్పించాలని, రిజర్వేషన్లు సబ్ కేటగిరి ఏర్పాటు చేసి కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ప్రకటించిన హామీలను అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలో అన్ని నామినేటెడ్ పదవుల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు 90 శాతం ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ నాయకులు పోచం సోమయ్య, అవిశెట్టి ఆవిలిమల్లు, కలిమెల నర్సయ్య, తండ సత్తయ్య, ఎడ్ల నరేష్, బయ్యని పిచ్చయ్య, మన్నె అంజయ్య, బయ్యని రాజు, మందుల సురేష్, గనగాని నర్సింహ, శివార్ల శ్రీను, బొడ్డుపల్లి మైసయ్య, పోలినేని స్వామిరాయుడు, ఎండి.మజీద్, మొరిగాల సురేష్, ఉప్పలయ్య, శ్రీరాములు, నెల్లికొండ మత్స్యగిరి తదితరులు పాల్గొన్నారు.




